క్లుప్తంగా

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాచర్ల: ప్రతి విద్యార్థి ఒత్తిడికి గురికాకుండా 10వ తరగతి పరీక్షలు రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలని కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్ గుప్తా, సదాశివరాజ్, వాణీ పేర్కొన్నారు. ఆదివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష సామగ్రి, షీల్డ్ ప్రదానం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధించి, ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు చెందిన హరీష్ చంద్ర, ఇన్‌చార్జి గౌరి, నాగ జ్యోతి, శ్రీలక్ష్మిరెడ్డి, అంజూ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాణి విద్యానికేతన్ 40వ వార్షికోత్సవం



మాచర్ల: నాలుగు దశాబ్దాలుగా పట్టణంలోని వాణి విద్యానికేతన్ ఉత్తమ విద్యార్థులను తయారు చేయడం అభినందనీయమని మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. పాఠశాల 40వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా చైర్మన్ పాల్గొన్నారు. ఎంఈఓ అల్లి సురేష్, కెనాల్స్ డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, గాదె రామకృష్ణారావు పాల్గొని, మాటడారు. హెచ్ఎం కేవీ రమణ, డైరెక్టర్ కె.అంజనీకుమారి పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరించండి

మాచర్ల : ఉపవాస ప్రార్థనల సందర్భంగా క్రైస్తవులు ప్రభువును ఆరాధిస్తూ, ఆయన బోధనలను ఆచరించాలని పశ్చిమ సినడ్ బిషప్ బిజయ్య బోధించారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న ఆంధ్రా ఇవాంజిలికల్ లూథరన్ చర్చిలో ఉపవాస ప్రార్థన సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలు స్తుతించారు. ఉదయం 11 నుంచి 2గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు చర్చిలో నిర్వహించారు.

గీతా గురుకులంలో ఉచిత వైద్యశిబిరం

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గీతా గురుకులం హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకి చెందిన డాక్టర్ కె.ప్రకాశ్‌రావు రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఎముకలు, కీళ్ల సమస్యలు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 231 మంది వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరం కరస్పాండెంట్ అనిశెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

షిర్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఆదివారం వార్షికోత్సవ పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బ్రహ్మ కుమారీస్ సంస్థ సేవలు ప్రశంసనీయం

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాల్లో వ్యసనాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి బ్రహ్మ కుమారీస్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రెంటచింతలలో బ్రహ్మ కుమారీస్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జన జాగరణ, వ్యసనాల నుంచి ముక్తిం పొందే మార్గాన్ని ఈ వాహనంతో ఆడియో, వీడియో ప్రసారాలతో వివరిస్తున్నట్లు చెప్పారు. వ్యసనాలతో బాధపడేవారిలో కనువిప్పు కలిగించి మార్పు తీసుకురావడం చాలా సంతోషకరమన్నారు. బ్రహ్మ కుమారి సిస్టర్ అర్చన మాట్లాడుతూ ధ్యానం వల్ల ఎలా దృఢ సంకల్పంగా ఉండగలమో వివరించారు. ఎలా వ్యసనాల నుంచి విముక్తి పొందగలమో అనేది ఈ రాజయోగ ధ్యానం బ్రహ్మ కుమరీస్ ఆధ్యాత్మిక సంస్థ ద్వారా ఉచితంగా 7 రోజులు కోర్సు రూపంలో నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి రామకృష్ణ, కేఎస్ శంకర్ రావు, దోర్నాల బంగారురెడ్డి పాల్గొన్నారు.

నష్టాలు మిగిల్చిన మిర్చి

- తగ్గిన మిర్చి ధరలు... ఆందోళనలో మిర్చి రైతులు
- పెరిగిన పెట్టుబడి...తగ్గుతున్న దిగుబడులు
- కూలీల రేట్లతో తప్పని ఇబ్బందులు



మిర్చి కోత కోస్తున్న కూలీలు

రెంటచింతల: కోటి ఆశలతో ఈ ఏడాది రైతులు రెక్కలు ముక్కలు చేసుకుని మిర్చి పంటను సాగు చేశారు. ప్రస్తుతం రోజురోజుకు మార్కెట్‌లో మిర్చి ధరలు పతనం కావడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మొదటి నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే మిర్చి పంట సాగుకు రెంటచింతలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. మండలంలోని రెంటచింతల, పాలువాయి, రెంటాల, జెట్టిపాలెం, తదితర గ్రామాల్లో రైతులు ఈ ఏడాది ఎకరాలలో మిర్చి సాగు చేశారు. చీడపీడలుర, దోమ, తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు ఇష్టానుసారంగా రసానిక ఎరువుల వాడకం వల్ల పెట్టుబడి రెండింతలు పెరిగింది. ఎకరాకు మిర్చి మొక్క కొనుగోలు నుంచి నాటు వేసి కోత కోసేవరకు రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది వివిధ తామరపురుగు దెబ్బకు ఒక ఎకరాకు సగటున 8 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు చెబుతున్నారు.

పెరిగిన కూలీల రేట్లు

ఎకరం మిర్చి కోతకు రకం బట్టి ఏడుగురు నుంచి 10 మంది వరకు కూలీలు పడుతున్నారని రైతులు చెబుతున్నారు. గ్రామాల్లో మిర్చి కోతలకు కూలీలు అందుబాటులో లేక పోవడంతో ఇతర గ్రామాల నుంచి పిలుపించుకుంటున్నారు. వారికి తీసుకురావడానికి రవానా ఖర్చు అదనం. రెండుమూడు రోజుల వరకు రోజు కూలీ రూ. 400 ఉండగా ప్రస్తుతం రూ. 450 నుంచి రూ.500 వరకు కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

కౌలు రైతుల పరిస్థితి దైన్యం..

మండలంలో 80 శాతం మంది కౌలు రైతులు మిర్చి పంటను సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి రైతుభ రోసా వంటి ఆర్థిక సాయం అందలేదు. పెట్టుబడి పెరిగినప్పటికీ దిగుబడి తగ్గడంతో పాటు మార్కెట్లో రోజురోజుకు ధరలు పతనం అవుతుండటంతో మిర్చి రైతన్నలు దిక్కుతోచకని స్థితిలో ఉండిపోతున్నారు. నిన్నా మొన్నటి వరకు మిర్చి రకం బట్టి ఒక క్వింటాకు రూ. 11 నుంచి రూ. 13,500 పలికిన ధర ఉండగా ప్రస్తుతం రూ. 8,500 నుంచి రూ.11 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. సాగులోని మిర్చి పంటను కాపాడుకునేందుకు బోరునీటిని ఒక్క తడికి రూ.1000 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన మేల్కొని మిర్చి రైతులకు గిట్టుబాటు ధరను చెల్లించి, రైతుల నుంచి నేరుగా పంట కొనుగోలు చేసి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర అందని ద్రాక్ష



మిర్చి రైతులకు గిట్టుబాటు ధర ఎప్పటికీ అందని ద్రాక్ష. ఈ ఏడాది ఎకరం కౌలు రూ.14 వేలు చొప్పున ఐదు ఎకరాలు మిరప పంటను సాగు చేశా. ఎకరాకు సుమారు రూ.1.30 లక్షలు పెట్టుబడి పెట్టా. ఒక్కతడి నీరు పెట్టుకునేందుకు రూ.1000 చెల్లిస్తున్నాను.

– బోయిన అమరలింగయ్య, కౌలురైతు, రెంటచింతల

రూ.4.50 లక్షల వరకు పెట్టుబడి



ఈ ఏడాది 3.5 ఎకరాల్లో మిరప పంట సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు రూ. 4.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. వివిధ రకాల తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది. మిర్చి ధరలు పూర్తిగా పడిపోతుండటంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితి. ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి.

– పేర్ల చౌదయ్య, కౌలురైతు, రెంటచింతల

కూలీలు దొరకడం లేదు



మిర్చి పంటకు పెట్టుబడి విపరీతంగా పెరిగింది. 5 ఎకరాల్లో మిర్చి పంటకు సుమారు రూ. 6.50 లక్షలు పెట్టుబడి పెట్టా. 70 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నిన్న మొన్నటి వరకు రోజు కూలీ రూ.400 ఉండగా ఇప్పుడు రూ. 500 అడుగుతున్నారు. ఎంత తక్కువ అనుకున్నా నాకు రూ. 2 లక్షల వరకు నష్టం వచ్చే అవకాశం ఉంది.

– శొంఠిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు, పాలువాయి

గృహ నిర్మాణ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

మాచర్ల రూరల్: నివేశన స్థలం కలిగిన పేదలు.. గృహ నిర్మాణ నిమిత్తం ప్రభుత్వ మంజూరు చేస్తున్న రుణానికి దరఖాస్తు చేసుకోవాలని రూరల్ హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు తెలిపారు. ఆదివారం గ్రామాల్లో పర్యటిస్తూ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పట్టణ ప్రజలకు రూ.2.50లక్షలు, ఎస్సీలకు రూ.3లక్షలు, ఎస్టీలకు రూ. 3.20 లక్షలు, పద్మశాలీలకు రూ.3లక్షలు రుణం మంజూరు చేస్తారని చెప్పారు. అలాగే రూరల్ లబ్ధిదారులకు రూ.1.85లక్షలు, ఎస్సీలకు రూ.2.35లక్షలు, ఎస్టీలకు రూ.2.55లక్షలు, పద్మశాలీలకు రూ.2.35లక్షలు రుణం ఇస్తారని చెప్పారు. లబ్ధిదారులు తహసీల్దారు జారీ చేసిన పట్టా, పొజిషన్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ కలిగిన డాక్యుమెంటేషన్‌ను నకళ్లు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇప్పటికే పట్టణంలో 479, రూరల్‌లో 1,565 దరఖాస్తులు అందాయని వెల్లడించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

మాచవరం: స్థానిక తహసీల్దారు కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎస్.నాగమల్లేశ్వరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ఆయా శాఖల అధికారులకు విన్నవిస్తే సత్వర పరిష్కారం చూపుతారని తెలిపారు.

రోడ్డు కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు



రోడ్డుపై ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

దాచేపల్లి : రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు మళ్లీ రోడ్డెక్కారు. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. రెండు గంటల పాటు రోడ్డుకి అడ్డుగా వాహనాలు, రాళ్లు పెట్టి నిరసన వ్యక్తం చేయడంతో భారీగా వాహనాలు నిలిచాయి. దాచేపల్లి-తంగెడ గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డులో భారీగా గుంతలు ఏర్పడటంతో ఇటీవల తవ్వారు. రెండు నెలల క్రితం రోడ్డు నిర్మాణం కోసం చర్యలు చేపట్టి నిలిపివేశారు. భారీ వాహనాల రాకపోకలతో దుమ్మూధూళితో ప్రజలు అల్లాడిపోతున్నారు. నాలుగు రోజుల క్రితం కూడా గ్రామస్తులు రోడ్డెక్కి ఆందోళన చేయగా పోలీసులు సర్ది చెప్పారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడారు. ఈ సమస్యను స్థానిక శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆందోళనకారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుమ్మూధూలి లేవకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లు చల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆందోళన కారణంగా వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

మనకు బాగా తెలిసిన నటుడు..మన ఊరివాడే..!



పిడుగురాళ్ల: చిన్న నటుడే.. కానీ, మనకు బాగా తెలిసిన నటుడు. ఒక్కసారి చూస్తే..పలానా సినిమాలో మీరు ఉన్నారుగా అని ప్రతి ఒక్కరూ గుర్తుపట్టగలిగే కళాకారుడు. మన ఊరి వాడు. మేకల సురేష్. పిడుగురాళ్ల పట్టణంలో పుట్టి పెరిగి మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి, ఆర్మీపై ఉన్న శ్రద్ధతో ఇండియన్ ఆర్మీలో టెలి కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా ఐదేళ్లు పనిచేశారు. తర్వాత అక్కడి నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 33 ఏళ్ల నుంచి ఉద్యోగం నిర్వహిస్తూ మెదక్ జిల్లాలో గువ్వలపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ.. 2022లో రిటైర్ అయ్యారు. ఒక పక్క ఉద్యోగం చేస్తూనే.. మరో పక్క నటనపై ఆసక్తితో మొదట సీరియల్ ప్రస్థానంతో ప్రారంభమై.. నేడు పలు సినిమాల్లో విలన్‌గా, సైడ్ యాక్టర్‌గా.. ఇలా ఎన్నో పాత్రలు పోషిస్తూ ఎంతో మంది ప్రేక్షకులకు దగ్గరయ్యారు..1974-75లో పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న ఆయన.. ఆదివారం తమ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. సాక్షితో చిట్‌చాట్..

రామ్‌చరణ్ సినిమాలో నటిస్తున్నా: మేకల సురేష్



నటపై ఆసక్తితో ఉద్యోగం చేసుకుంటూ 1999లో దూరదర్శన్‌లో వసంత కోకిల అనే సీరియల్‌లో విలన్ పాత్ర ద్వారా నాట నటన ప్రస్థానం మొదలైంది. కబడ్డీ, చంటిగాడు, లీడర్, ఇటీవలే విడుదలై హిట్ అయిన తండేల్ సినిమాతో కలిపి 65 సినిమాల్లో పలు పాత్రల్లో మెప్పించాను. తాజాగా రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న సినిమాలోనూ నటిస్తున్నాను. ఇంకా టైటిల్ ఖరారు కాని నితిన్ హీరోగా దిల్ రాజు నిర్మిస్తున్న సినిమాలో, వరలక్ష్మీ శరత్‌కుమార్‌కు ఓ సినిమాలో తండ్రి పాత్ర పోసిస్తున్నాను. మరికొన్ని చిత్రాల్లో నటించేందుకు కమిట్‌మెంట్ తీసుకున్నాను. అలాగే మా అసోసియేషన్‌లో పర్మినెంట్ మెంబర్‌గా ఉన్నాను. అసోయేషన్ అభివృద్ధి నా వంతు కృషి చేస్తున్నాను. ఇక నా కుటుంబ నేపథ్యానికి వస్తే.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన మేకాల కృష్ణమూర్తి, వెంకాయమ్మ తల్లిదండ్రులు. మా తండ్రిగారు తెలుగు పండిట్‌గా పిడుగురాళ్ల పట్టణంలో చాలా సంవత్సరాలు ఉద్యోగం చేశారు. తల్లిదండ్రులు ఇద్దరు కాలం చేశారు. భార్య ఉమాదేవి హౌస్ వైఫ్‌గా ఉన్నారు. ఒక అబ్బాయి శ్రీ పవన్ హైదరాబాద్‌ల సాఫ్ట్‌వేర్‌గా, అమ్మాయి సాయి ప్రవళిక హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా చేస్తుంది. ఉద్యోగ విరమణ తర్వాత సినిమాల్లో నటిస్తూ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాం.

పూర్వ విద్యార్థుల కలయిక



పాఠశాలలో పూర్వ విద్యార్థులు

మాచర్ల రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 1979-80లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 45 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. న్యూటన్స్ గ్రూప్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, జర్నలిస్టు గాడిపర్తి రామయ్య, ఉపాధ్యాయుడు కేవీ నాగార్జున, కాలేషావలి, జ్ఞానరత్నం పాల్గొన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం విరాళాలు అందించి, గౌతమబుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 150 కి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ కొమెర నాగేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి రవికుమార్, సుభాని, ఉప్పుతోళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

క్రీడా వేదికకు శంకుస్థాపన

పెదకూరపాడు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను అభివృద్ధి చేసేందుకు దాతల సహకారం ఎంతో అవసరమని పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి.రమణ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా ప్రాంగణంలో క్రీడా వేదిక నిర్మాణానికి దాత ఆర్తిమళ్ళ రమేష్ చేతుల మీదగా ఆదివారం శంకుస్థాపన చేశారు. దాత ఆర్తిమళ్ల రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బస్ షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ

రెంటచింతల: యర్రబోతుల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ వద్ద కుటుంబ సభ్యులు బస్ షెల్టర్ నిర్మించడం అభినందనీయమని ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బస్ షెల్టర్ నిర్మాణానికి వారు భూమి పూజా చేశారు. వివిధ ప్రాంతాలకు బస్ ప్రయాణం చేయు ప్రజలకు ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, గుండా నరసింహారావు, గుండా రామ్మూర్తి, యేచూరి కాశీపతి, నాళం పెదబాబు, యేచూరి వెంకట సైదయ్య, సైదులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



విజయపురిసౌత్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ళ, చిలకలూరిపేట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మాచర్ల మండలం నాగులవరం, బెల్లంకొండవారి పాలెం, సుబ్బారెడ్డి పాలెం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫాల్గుణమాసం, హోలీ పౌర్ణమి పండుగలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె అరుణ, కె కార్తీక్, కె నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి, డి.శ్రీను, ఎం.వీరయ్య, టి.రాఘవ, వి.సుందరం, వై.రామాంజనేయులు, కె.గంగయ్య, కోటేశ్వరమ్మ, వెంకటేశ్వర నాయక్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే యరపతినేని

గురజాల రూరల్ : గురజాలకు వచ్చే ప్రజలకు తాగునీటి అవసరం తీర్చేందుకు చలి వేంద్రాలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పనులు నిమిత్తం గురజాలకు పలు గ్రామాల నుంచి వచ్చే వారు తాగు నీటికి ఇబ్బందులు లేకుండా మంచినీటిని అందించాలనే లక్ష్యంతో చలివేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జి.లక్ష్మీనారాయణ, పులుకూరి కాంతరావు, ఎస్ బొల్లయ్య, నవులూరి శ్రీరామమూర్తి, శరమాళ్ల హనుమంతరావు, కూటమి నాయకులు ఉన్నారు.

ప్రముఖ మహిళలకు సన్మానం



మహిళాలను సన్మానిస్తున్న మాచర్ల రోటరీ క్లబ్ సభ్యులు

మాచర్ల: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివార రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి అధ్యక్షత వహించారు. నిర్వాహకురాలి నిమ్మగడ్డ సురేఖ వ్యవహరించారు. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసోసియేటెడ్ ప్రొఫెసర్ డాక్టర్ కోసూరి అనంత సునీత, వీణ కళాకారులు రామరాజు లక్ష్మీ శ్రీనివాసు, ప్రముఖ విద్యా సంస్థ డైరెక్టర్ పాతూరి కోటేశ్వరమ్మ, స్థానిక సెయింట్ ఆన్స్ స్కూల్ సైన్సు అసిస్టెంట్ మల్లిపెద్ది అరుణను ఘనంగా సన్మానించారు. శ్రీ సత్య సాయి విద్యా విహార్ బాలికల చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. రోటరీ క్లబ్ డిప్యూటీ గవర్నర్ కొండవీటి రామకోటయ్య, నిర్వహణ కన్వీనర్స్ కొండ లీలా శివప్రసాద్, యనమదల వెంకట్రామయ్య, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మీ, తుమ్మల రాధా, కల్పనా దేవి, డాక్టర్ అనురాధ, రోటరీ క్లబ్ సభ్యులు, జాగృతి మహిళా మండలి సభ్యులు, రోటరీ క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పఠాన్ నాగూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై జరిగిన ఆటల పోటీలు గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.

50 ఏళ్ల స్నేహ పరిమళం



1974-75 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1974-75లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. 50 ఏళ్ల ఏళ్ల తర్వాత స్నేహితులందరూ ఒక్క చోట చేరి సంతోషంగా గడిపారు. కుశల ప్రశ్నలతో మునిగిపోయారు. బ్యాచ్‌లో 90 మంది ఉండగా..అందులో 25 మంది మృతి చెందారు. 50 మంది సమ్మేళనానికి హాజరయ్యారు. సుధూర ప్రాంతాల వారు కొందరు హాజరు కాలేదు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. ఆనంద భాష్పాలు రాల్చారు.


జగన్ పాట పెట్టారని..పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు



పోలీసులు విడిచిపెట్టిన మెగా ఈవెంట్ ఆర్కెస్ట్రా వాహనం

పిడుగురాళ్ల: రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఒక బ్రాండ్‌గా ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించారు. అంతటి ప్రజాదరణ కలిగిన నాయకుడికి సంబంధించిన పాటలను వినిపించినందుకు ఆర్కెస్ట్రా వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో జరిగింది. కరాలపాడు గ్రామంలో ఈ నెల 7న ఒక వివాహ వేడుకలో వైఎస్ జగన్ పాటలను ఆర్కెస్ట్రా వారు ఆలపించారు. దీంతో గ్రామంలోని టీడీపీకి చెందిన కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక అదే ఆలస్యమన్నట్లు పట్టణ సీఐ రాత్రికి రాత్రే ఆర్కెస్టా వాహనంతో పాటు ఆర్గనైజర్లు, డ్యాన్సర్లను పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్గనైజర్లు, డ్యాన్సర్లను తర్వాత పోలీస్ స్టేషన్ నుంచి పంపించారు. ఆర్కెస్ట్రా వాహనం మాత్రం పోలీస్ స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. గత రెండు రోజులుగా ఆర్కెస్ట్రా వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచారు. దీంతో ఆర్గనైజర్లు మరో ప్రాంతంలో ప్రొగ్రాంలు ఉన్నాయని, దయచేసి తమ వాహనాన్ని విడుదల చేయాలంటూ పోలీసులను బతిమాలినా..వారు ససేమేర అంటున్నారు. ప్రోగ్రాం చేసుకుంటేనే రూ.10 నుంచి రూ.20 వేలు వస్తాయని, అంతకు మించి రావని, తాము డబ్బులు ఇవ్వలేమని చెప్పినప్పటికి వాపోయారు. చివరికి కొంత నగదు పోలీస్ స్టేషన్‌లో అందించిన తర్వాత ఆర్కెస్ట్రా వాహనాన్ని పోలీస్ స్టేషన్ నుంచి విడుదల చేసినట్లు ఆర్గనైజర్‌లు వాపోయారు. జగన్‌మోహన్ రెడ్డి పాటలు పెడితేనే.. వాహనాన్ని పోలీసులు అదుపులోకి తీసుకొని వేధించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు మరీ ఇంత దిగజారిపోయి.. పొట్టకూటి కోసం పనిచేసుకునేవారిని ఇలా పట్టుకుని పీడించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వందన

రెంటచింతల: స్థానిక శివాలయం కల్యాణ మండపంలో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో చల్లగుండ్ల ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి శుక్లముల వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించినట్లు డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. డాక్టర్ బండారు చిరంజీవి ప్రారంభించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 184 మంది రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 66 మందికి కంటి శుక్లముల శస్త్ర చికిత్స నిమిత్తం పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గుండా జనార్దన్ రావు, నాళం పెదబాబు, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, యేచూరి వెంకట సైదయ్య, గూడూరి జానకిరామ్, ఇన్‌ఛార్జి సైదులు, రాంబాబు, పారామెడికల్ సిబ్బంది, వాగ్దేవి కళాశాల విద్యార్థులు సేవలు అందచేశారు.